క్లుప్తంగా

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



నెల్లూరురూరల్: మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి దేవాలయం వద్ద పండిట్ దీన్‌దయాళ్ జయంతిని బీజేపీ నేతలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, అల్లూరు నాగేంద్ర సింగ్, మురగ నరేష్, ఏవీ సుబ్బయ్య, గంగుల జనార్దన్, పేట రమణయ్య, దసరామయ్య, కందుకూరు శివకుమార్, చిరమన వెంకటకృష్ణయ్య, రఘురామయ్య, టి.శ్రీనివాసులు, ముజీబ్ విజయశ్రీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుడు దేవిశెట్టి సుబ్రహ్మణ్యం కుమారుడు దివంగత ఫణీంద్ర జ్ఞాపకార్థం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న సత్యసాయి సేవా ట్రస్టులో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రిలో రోగుల వద్ద ఉండే అటెండెంట్‌లకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతల అమరేంద్రరెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రరెడ్డి శెట్టి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది



నెల్లూరురూరల్: అన్ని దానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని, యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని స్వర్ణభారత్ ట్రస్టు నిర్వాహకురాలు దీపా వెంకట్ అన్నారు. మూలాపేట అలంకార్ సెంటర్‌లో సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక బీజేపీ కార్యకర్తలు గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆమె హాజరై, మాట్లాడారు. ఇప్పటివరకు దాదాపు 75 శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, గంటా విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో జిల్లాస్థాయి షటిల్ పోటీలు

ఇందుకూరుపేట: ఏకొల్లు సుధీర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరులో ఈనెల 27, 28వ తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా డీపీ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచే వారికి రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలను అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు నిబంధనల మేరకు పోటీల్లో పాల్గొనవచ్చని కోరారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

• రాగి తీగలు చోరీ



కోవూరు: మండలంలోని లేగుంటపాడు పరిధిలో పంట పొలాల మధ్య గుర్తుతెలియని వ్యక్తులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. స్థానిక రైతులు ఎప్పటిలానే సాగు పనులు చేసేందుకు ఉదయం పంట పొలాలకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమైనట్లు గుర్తించారు. అందులోని రాగి తీగలను చోరీకి గురికావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా గస్తీని ముమ్మరం చేయాలని కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణామమం.. జగజ్జననీ

• వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెయ్యికిలోల మిఠాయిలతో అలంకరణ

నెల్లూరు(బృందావనం): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు గురువారం జగజ్జనని లోకేశ్వరి పాహిమాం.. రక్షమాం.. అంటూ భక్తులు ప్రణమిల్లారు. ఈ క్రమంలో నగరంలోని ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

➡ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షీ సుందరేశ్వరస్వామి ఆలయంలో లలితా కుంకుమార్చన, మహన్యాసం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల ఉభయకర్తలుగా దేవిరెడ్డి శైలజ, బి.కృష్ణప్రసాద్, సుహాసిని, ఎస్.మల్లికార్జునరెడ్డి, అమూల్య వ్యవహరించారు

➡ స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మూలవర్లకు వెయ్యి కిలోల మిఠాయిలతో అలంకరణ నిర్వహించారు. ఉభయకర్తలుగా వేముల ప్రసాద్- సుజాత, వి.రామ్మూర్తి- దొరసాని, పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు- శైలజ దంపతులు వ్యవహించారు. కార్యక్రమాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, నిచ్చెనమెట్ల చిరంజీవి, ఉమ్మెన జనార్దన్, ఆంజనేయులు, వేముల ప్రసాద్, మునగా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఎ.శ్రీధర్‌రెడ్డి- మహిత, ఎం.మురళీకృష్ణంరాజు- అనిత దంపతులు, గూడూరు సుబ్బారెడ్డి, లక్ష్మమ్మ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు భవాని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పి.ఫణికుమార్ రెడ్డి- స్వర్ణలత దంపతులు వ్యవహరించారు.

➡ సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా డి.వెంకటేశ్వర్లు- లక్ష్మి, విజయకుమార్- కల్పన దంపతులు వ్యవహరించారు.

➡ ఏసీ నగర్ కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ముచ్చర్ల సుబ్బరాయుడు- లత, కాకర్ల వెంకట్రావ్- శ్రీలత, మద్దాళి శ్రీనివాసరావు- అజితకుమారి, అద్దేపల్లి శ్రీనివాసులు- వెంకట పద్మావతి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం కమిటీ చైర్మన్ పత్తి నరసింహం, సభ్యులు శ్రీనివాసులు, కాటేపల్లి వెంకటరమణయ్య, ఎర్రా వీరరాఘవులు, దామెర చంద్రమౌళి తదితరులు పర్యవేక్షించారు.

➡ మెక్లిన్స్‌రోడ్డు విరాట్ నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కె.రమేష్‌ఆచారి- ఉమామహేశ్వరి, కె.వసంతకుమార్‌ఆచారి- కార్తికవల్లి, జి.ఉదయతేజ- పూజ దంపతులు వ్యవహరించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు మీనాక్షి అలంకారంలో దర్శనమిచ్చారు. ధనలక్ష్మి హోమం, కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వాయుగుండ్ల వేణుగోపాల్- ప్రసన్న దంపతులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

➡ నవాబుపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా జాఫర్‌సాహెబ్ కాలువకట్ట, కిసాన్‌నగర్ అగ్నికుల క్షత్రియ మిత్రమండలి సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమాలను సాదా నాగేంద్రకుమార్, కంచి జ్ఞానేంద్ర, దేవస్థానం కార్యనిర్వహణాధికారి జీసీహెచ్ దర్గయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు త్రిపురసుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఎం.కృష్ణప్రసాద్- వసుంధర దంపతులు వ్యవహరించారు.

➡ వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న గురువాయూర్ మహావిష్ణు, మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు మీనాక్షి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా స్వామిఅయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు వ్యవహరించారు.

➡ నవాబుపేట పరుచూరివారి వీధిలో ఉన్న మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నవావరణ పూజలు విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా పారా శ్రీధర్‌శర్మ- సావిత్రి దంపతులు వ్యవహరించారు.



నవాబుపేట ధర్మరాజస్వామి ఆలయంలో కాత్యాయనిగా..



కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో చండీ అలంకారం

వెంకటేశ్వరపురంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జనహిత వాత్సల్య ఆశ్రమ బాలలు నిర్వహించిన ప్రత్యేక నృత్య ప్రదర్శన అలరించింది. ఆవుల అభిలాష్- ప్రవీణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకుడు సాయి భరద్వాజ, ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



రామావతార అలంకారంలో వెంకటేశ్వరస్వామి



నవాబుపేట మహాలక్ష్మమ్మ దేవస్థానంలో..



పార్వతి అలంకారం



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరిగా..



వేదాయపాళెంలో మీనాక్షిదేవి అలంకారం



బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో మీనాక్షి అలంకారం

బకాయిలు చెల్లించని వారిపై చర్యలు

నెల్లూరు(బారకాసు): నేషనల్ లోక్ అదాలత్ నోటీసులు అందుకుని, బకాయిలు చెల్లించని వారి కొళాయి కనెక్షన్లను తొలగించాలని కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ రెవెన్యూ సిబ్బందితో వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు సంబంధించి కొళాయి పన్ను డిమాండ్ రూ.41 కోట్లకు గానూ ఇప్పటివరకు కేవలం రూ.5 కోట్లు మాత్రమే వసూలు చేశారని, ఇంకా రూ.36 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ 13న నేషనల్ లోక్ అదాలత్ కోర్టు జరుగుతుందని తెలియజేశారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకుంటే ఆ సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అనిల్‌కుమార్, శేషగిరిరావు, అసిస్టెంట్ ఇంజినీర్లు, రెవెన్యూ ఆఫీసర్లు సమద్, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు, ఫిట్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరమ్ నేడు

నెల్లూరు(బారకాసు): భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులు, మార్ట్‌గేజ్ రిలీజ్, లేఅవుట్ రెగ్యులైజేషన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తి కోసం ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నామన్నారు. భవన యజమానులు పాల్గొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, అలాగే సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

తిరుమలకు ఉచిత యాత్ర రేపు

నెల్లూరు(బృందావనం): సత్యమార్గ్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న నెల్లూరు నుంచి తిరుమలకు ఉచిత దీవెన యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కన్వీనర్ పి.మస్తానమ్మ గురువారం తెలిపారు. తిరుమలలో జరుగుతున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం 10 గంటలకు తిరుమల ఉచిత దీవెనయాత్రను పురమందిరం ప్రాంగణంలోని జ్యోతి విఘ్నేశ్వరస్వామి ఆలయం నుంచి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూడి రవిస్వామి ప్రారంభిస్తారన్నారు. యాత్రలో పాల్గొనే భక్తులు 93466 99526 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రతిఒక్కరి సంకల్పంతోనే స్వచ్ఛ భారత్

• కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(బారకాసు): ప్రతిఒక్కరి సంకల్పంతోనే స్వచ్ఛ భారత్ సాధ్యమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో గురువారం కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ నందన్, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, పరిసరాలను శుభ్రం చేశారు. దర్గా ప్రాంగణమంతా కలియతిరుగుతూ చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను శుభ్రం చేసిన కలెక్టర్ ప్రతిఒక్కరిలో స్వచ్ఛభారత్ స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారంలో ఒకరోజు గంటసేపు మన పరిసరాలను శుభ్రం చేసుకోవడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశంగా చెప్పారు. మన ఇంటితో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం మనందరి కర్తవ్యంగా ఉండాలన్నారు. సమాజహితం కోసం ప్రతిఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు, ఎన్‌సీసీ విద్యార్థులు కూడా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.



బారాషహీద్ దర్గా ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సంతపేట మార్కెట్‌లో అగ్నిప్రమాదం

• పాతదుస్తుల విక్రయ షాపులు దగ్ధం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని సంతపేట మార్కెట్‌లో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పాతదుస్తులు విక్రయించే ఏడు షాపులు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సంతపేట మార్కెట్‌లో పాత దుస్తుల విక్రయ దుకాణాలున్నాయి. ఓ దుకాణంలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శరవేగంతో మంటలు పక్కనున్న దుకాణాలకు వ్యాపించాయి. దీనిని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది శివసాయికుమార్, ఎలియాజ్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో శీనయ్య, షాజాహాన్, కామాక్షి, నూర్జహాన్, సాజిద, జయలక్ష్మి, పద్మ దుకాణాలు దగ్ధమైనట్లు తెలిసింది. మరో ఆరు దుకాణాలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం. సుమారు రూ.11 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటనా స్థలాన్ని స్థానిక ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



దుకాణంలో ఎగసిపడుతున్న మంటలు

మార్కెట్లోకి హోండా సీబీ 125 హార్నెట్ బైక్

నెల్లూరు (టౌన్): స్థానిక ఎంజీబీ ఫెలిసిటీ మాల్‌లో శ్రీషిర్డీ షా హోండా షోరూమ్ వారు ఆల్ న్యూ హోండా సీబీ 125 హార్నెట్ నూతన మోటార్ బైక్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ శ్రామ్‌ప్రసాద్ గురువారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షిర్డీ షా హోండా మేనేజింగ్ పార్టనర్ కొండా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ బైక్ గోల్డెన్ యూఎస్‌డీ ఫ్రంట్ డిజైన్, కీ ఆన్ ట్యాంక్ డిజైన్, ఆధునాతన టీఎఫ్‌టీ మీటర్, 1-చానల్ ఏబీఎస్, మోనోషాక్ రియర్ సస్పెన్షన్ తదితర అధునాతన సౌకర్యాలు కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో షోరూమ్ జనరల్ మేనేజర్ మీరా మొహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



మర్యాదపూర్వకంగా..



ఆనం దంపతులను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు సిటీ: జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిలను చింతారెడ్డిపాళెంలోని వారి నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో పార్టీ జిల్లా బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా సెక్రటరీ బోయళ్ల ఆదిరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉన్నారు.

బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మాణానికి సంతకాల సేకరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): 21వ డివిజన్ పరిధిలోని కొండాయపాళెం రైల్వేగేటు వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జిను వెంటనే నిర్మించాలని కోరుతూ సీపీఎం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొండాయపాళెం రైల్వే గేటు ద్వారా చాలా మంది ప్రజలు, భవన నిర్మాణ, ఆటో కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రయాణాలు సాగిస్తున్నారని, ఎక్కువ సమయం రైల్వేగేటు వేసి ఉండడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో అండర్ బ్రిడ్జిను కాకుండా, బాక్స్‌టైప్ బ్రిడ్జిను నిర్మిస్తే స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. సేకరించిన సంతకాలతో ఈనెల 29న జరిగే గ్రీవెన్స్‌డేలో వినతి పత్రాలను రైల్వే అధికారులతో పాటు, కలెక్టర్, ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రూరల్ కమిటీ కార్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు పెంచలప్రసాద్, శ్రీనివాసులు, సుధాకర్, సీఐటీయూ నాయకులు రంగయ్య, కృష్ణమూర్తి, రమణయ్య, రత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఐ వినియోగంపై అవగాహన సదస్సు

నెల్లూరు (టౌన్): స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో నెక్స్ట్ జనరేషన్ సెల్యూలర్ కమ్యూనికేషన్స్ 5జీ నెట్‌వర్క్‌లో ఏఐ వినియోగం అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. తొలుత వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ముఖ్య అతిథిగా బీఎస్ఎన్ఎస్ నెల్లూరు డివిజనల్ ఇంజినీర్ సుకుమార్ పాల్గొని, మాట్లాడారు. 5జీ నెట్‌వర్క్‌లో ఏఐ ఏ విధంగా ఉపయోగపడుతుందో విద్యార్థులకు వివరించారు. నెట్‌వర్క్ పనితీరును మెరుగుపరచడంలో, అంతరాయాలను గుర్తించడంలో, డేటా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించడంలో ఏఐ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హజరత్తయ్య, ఈసీఈ విభాగాధిపతి మురళి పాల్గొన్నారు.



పర్యావరణాన్ని పరిరక్షించాలి

నెల్లూరు (టౌన్): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామారావు తెలిపారు. స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నేషనల్ సోషల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా గురువారం వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి రామ్‌ప్రసాద్, వర్క్‌షాపు సూపరింటెండెంట్ విజ్ఞకుమార్, హాస్టల్ మేనేజర్ గోపాల్, ఎన్ఎస్ఎస్ అధ్యాపకుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అధ్యాపకులు

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): స్థానిక 29వ డివిజన్ పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్ సత్తార్ తెలిపారు. ఈ మేరకు నగరపాలక సంస్థలోని వెటర్నరీ విభాగానికి చెందిన సిబ్బందిని గురువారం పిలిపించి వీధి కుక్కలను పట్టించి వాటి వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందుల్లేకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. కుక్కల నియంత్రణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు జాకీర్ పాల్గొన్నారు.



వీధి కుక్కను పట్టుకుంటున్న ఎన్ఎంసీ సిబ్బంది

ఆర్థిక సాయం అందజేత

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌కు సహచర కానిస్టేబుల్స్, అధికారులు ఆర్థిక చేయూతనందించారు. తోటపల్లిగూడూరు మండలానికి చెందిన పి.నవీన్‌కుమార్ నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈనెల 11వ తేదీన విధులకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రెండు కాళ్లు విరిగిపోయి అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్‌కు అవసరమైన నగదును అందించేందుకు 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్, సీఐలు సుబ్బారావు, అంకమరావు తదితరులు ముందుకొచ్చారు. అందరూ కలిసి రూ.1,73,600 నగదు సేకరించారు. కానిస్టేబుల్స్ జి.మస్తాన్, షేక్.గౌస్‌బాషా, జి.వేణులు గురువారం అపోలో హాస్పిటల్‌కు చేరుకుని ఆ మొత్తాన్ని నవీన్‌కుమార్ తల్లికి అందజేశారు. తామంతా ఉన్నామని సహచరునికి ధైర్యం చెప్పారు.



నవీన్‌కుమార్ తల్లికి నగదు అందజేస్తున్న కానిస్టేబుల్స్